గంజాయి పొగకు దాడుల సెగ!

తమిళ నాడు ఘటనతో రంగంలోకి రాష్ట్ర ఆబ్కారీ శాఖ

- **పెరుగుతున్న కేసులు.. అదుపులోకి తెచ్చేందుకు యత్నాలు**
- **ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులతో కొంతమేర తగ్గుముఖం**
- **500 డ్రగ్స్ కేసుల్లో 2,680 కిలోల గంజాయి స్వాధీనం**

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోకి దొడ్డిదారిలో డ్రగ్స్ చొరబడుతున్నాయి. మారుమూల గ్రామాల్లోనూ గంజాయి పాతుకుపోతున్నది. దీనికితోడు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో గుడుంబా వాసన మళ్లీ గుప్పుమంటున్నది. ఇటీవల తమిళనాడులో కల్తీసారా తాగి 50 మంది వరకు చనిపోయారు. దీంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ రంగంలోకి దిగింది. డ్రగ్స్, సారా రహిత తెలంగాణ కోసం నిఘా మరింత పెంచింది. ఎక్కడికక్కడ ముప్పేట దాడులు చేస్తున్నది. క్షేత్రస్థాయి నుంచి సమాచార వ్యవస్థను పటిష్ఠం చేస్తూ డ్రగ్స్, సారా విక్రేతలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం జరుగుతున్నా, నాటు సారా తయారీ జరుగుతున్నా సమాచారం తెలుసుకోగలుగుతున్నారు. పట్టుబడిన మాదకద్రవ్యాలు, నాటు సారా తయారీదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు.

తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి

గంజాయి బ్యాచ్‌లపై నిఘా

పచ్చని పల్లెల్లోని యువతను గంజాయి నిర్వీర్యం చేస్తున్నది. రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా ఇప్పుడు ఐదారు గంజాయి బ్యాచ్‌లు దర్శనమిస్తున్నాయి. వీటిపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులే గంజాయికి అలవాటు పడుతుండటం ఆందోళన కలిగించే అంశం. దీంతో ఎక్సైజ్‌శాఖ గ్రామాల్లో సైతం గంజాయి బ్యాచ్‌లపై నిఘా పెట్టింది. కేవలం ఆరు నెలల్లో సుమారు 2,680 కిలోల గంజాయి, 92 కిలోల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నది. 440 గంజాయి మొక్కలు ధ్వంసం చేసింది. 2 కిలోల హషీష్ ఆయిల్, కేజీన్నర గంజాయి లిక్విడ్, 117 గ్రాముల చరాస్, 1,236 కేజీల పప్పీస్ట్రా, 6 కేజీల ఓపీఎం, 101 కేజీల ఎంఎంసీ, 348 గ్రాముల ఎండీఎంఏ, 37 ఎల్ఎస్‌డీ బ్లాట్స్, 10 కేజీల ఆల్ప్రాజోలం, 10 కేజీల ఆల్ప్రాజోలం ట్యాబ్లెట్లను అధికారులు పట్టుకున్నారు. మొత్తం 500 కేసులు నమోదు చేసి, 725 మందిని అదుపులోకి తీసుకున్నారు.

మత్తు మహమ్మారిని పారదోలుదాం

ఎక్సైజ్‌శాఖ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన పెరిగింది. వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సారాతయారీపై సమాచారం ఇస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచనల మేరకు పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది సమన్వయంతో అన్ని గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. సమాచారం ఇచ్చేవారి సంఖ్య మరింత పెరగాలి. అప్పుడే డ్రగ్స్, సారా, మత్తు రహిత తెలంగాణను చూడగలం. ఎక్సైజ్‌శాఖ మాదకద్రవ్యాల వినియోగాన్ని, అక్రమ రవాణాను అరికట్టేందుకు దృఢనిశ్చయంతో ఉన్నది. అందరం కలిసి మత్తు మహమ్మారిని పారదోలుదాం.

– వీబీ కమలాసన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

సాంకేతికత వినియోగంతో పెరిగిన అరెస్టులు

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అడ్డుకట్టకు ఎక్సైజ్ శాఖ సాంకేతికతను ఉపయోగించుకుంటున్నది. అక్రమ రవాణా దారుల ఆచూకీ తెలుసుకొని, వారిని అరెస్టు చేస్తున్నది. దీంతో మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులు, నాటు సారా తయారీదారులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వచ్చే ఆగస్టు నాటికి రాష్ట్రం నుంచి సారా మహమ్మారిని పారదోలాలన్న లక్ష్యంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నది. ఆసిఫాబాద్, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లో చాటుమాటుగా తయారు చేస్తున్న వ్యక్తులపై నిఘా పెట్టింది. ఈ ఏడాది మే నాటికి 12,734 నాటుసారా కేసులు నమోదు కాగా, 5,398 మంది తయారీదారులను అరెస్ట్ చేసింది.

ఆ పింఛన్ వాపస్ ఇవ్వాల్సిందే

మొదటిపేజీ తరువాయి...

నాటికి 1,826 మందికి రికవరీ నోటీసులు జారీ చేసినట్టు ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించింది. పింఛన్లు తొలగించనున్న 1,826 మంది జాబితాను ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులు జిల్లాలకు పంపించారు. ఇప్పటివరకు పొందిన పింఛన్ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలని, లేదంటే ప్రభుత్వ పథకాలన్నింటిని నిలిపివేస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో పూట గడవడమే కష్టంగా ఉన్న తాము ఈ వయస్సులో డబ్బులు తిరిగి ఎలా చెల్లించగలమని నోటీసులు అందుకున్న వృద్ధులు లబోదిబోమంటున్నారు. ఎవరికైనా నిబంధనలకు విరుద్ధంగా రెండేసి పింఛన్లు వస్తున్నట్టయితే వాటిని గుర్తించి నిలిపివేయాల్సిన అధికారులు ఇన్నాళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరించి, ఇప్పుడు హడావుడిగా నోటీసులు జారీ చేయడం ఏమిటని సామాజికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వాటికి అధికారుల పొరపాటు, నిర్లక్ష్యం కారణమని, మొదట వారిపై చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

రెండు పింఛన్లు ఇవ్వం : మంత్రి సీతక్క

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన దాసరి మల్లమ్మకు 2014 నుంచి ఆసరా పింఛన్ అందుతున్నది. అయితే, ఆమె కూతురు డీ రాజేశ్వరి వైద్య ఆరోగ్యశాఖలో ఏఎన్ఎంగా పనిచేస్తూ మరణించడంతో మల్లమ్మకు ఫ్యామిలీ పెన్షన్ కింద నెలకు రూ.24,073 వస్తున్నదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే వ్యక్తి రెండు రకాల పెన్షన్లు తీసుకోవడానికి నిబంధనలు అంగీకరించవని స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా వృద్ధాప్య, ఫ్యామిలీ పెన్షన్ రెండింటినీ 1,826 మంది పొందుతున్నట్టు ట్రెజరీ శాఖ ఈ మధ్యనే గుర్తించి వారందరికీ రికవరీ నోటీసులు అందజేసిందని తెలిపారు. ప్రభుత్వం మీద బురద చల్లడమే పనిగా పెట్టుకున్న కొందరు ప్రభుత్వానికి దురుద్దేశాలను ఆపాదిస్తూ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆరోపించారు. తమ ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తున్నదని, అర్హులందరికీ పెన్షన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అందులో భాగంగానే లీకేజీలను అరికట్టడంతోపాటు ఎప్పటికప్పుడు లబ్ధిదారుల జాబితాను అప్‌డేట్ చేస్తున్నట్టు వెల్లడించారు.

మంచానపడిన మల్లమ్మ

- **కేటీఆర్ ట్వీట్‌తో మల్లమ్మ ఇంటికి అధికారులు**

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 13 (నమస్తే తెలంగాణ): 'పింఛన్ల రిక'వ్రీ'' పేరుతో 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురించడం, దానిపై స్పందించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్ చేసిన నేపథ్యంలో అధికార యంత్రాంగంలో కదలిక మొదలైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు దాసరి మల్లమ్మ పరిస్థితిపై విచారణ జరిపారు. జిల్లా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదేశాల మేరకు అదనపు డీఆర్‌డీవో రంగారావు సిబ్బందితో మల్లమ్మ ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. అసలు మల్లమ్మ ఏంచేస్తున్నది? ఆమెకు అండగా ఎవరున్నారు? వారి కుటుంబ పరిస్థితి ఏమిటి? అని ఆరా తీశారు. మల్లమ్మ మంచాన ఉండటం గమనించారు. ఉలుకూపలుకూ లేని పరిస్థితిని పరిశీలించి నివేదిక తయారుచేశారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్టు డీఆర్‌డీవో విద్యాచందన 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. వాస్తవంగా తన కూతురు ఉద్యోగం చేసి మరణించడంతో మల్లమ్మకు ఫ్యామిలీ పెన్షన్ వస్తున్నది. ఇలాంటి కేసులు జిల్లాలో 200 వరకూ ఉన్నట్టు అంచనా. మల్లమ్మ ఏడాది క్రితం పక్షవాతంతో దవాఖానలో చేరడంతో వైద్యానికి రూ.2 లక్షల వరకు ఖర్చు అయిందని, దీనికి నెలనెలా పరీక్షలు చేయించుకోవడంతో గతంలో వచ్చిన పింఛన్ పూర్తిగా ఖర్చు అయిపోయిందని కుటుంబసభ్యులు చెప్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆసరా పింఛన్ మందులకే సరిపోతున్నదని వాపోతున్నారు. పక్షవాతం, చెవుడు, వయోభారంతో బాధపడుతున్న మల్లమ్మకు రికవరీ నోటీసులు జారీ చేయడంతో కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు.

మంచంలో కదలలేని స్థితిలో ఉన్న మల్లమ్మ

పింఛన్ రికవరీ దుర్మార్గపు చర్య

రాష్ట్రంలో వృద్ధులకు ఇచ్చిన పింఛన్ పైసలను రేవంత్‌రెడ్డి సర్కార్ తిరిగి రికవరీ చేయాలనుకోవడం దుర్మార్గపు చర్య. కొత్తగూడెం మున్సిపాలిటీలో 42 మందికి ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలి. నోటీసు అందించిన ఏడురోజుల్లో తీసుకున్న పింఛన్ మొత్తం చెల్లించకపోతే ప్రభుత్వం నుంచి పొందుతున్న అన్నిరకాల లబ్ధిని నిలిపివేస్తామని ఆదేశాలు జారీ చేయడం నిరంకుశ పాలనకు నిదర్శనం.

–కాపు సీతాలక్ష్మి, కొత్తగూడెం మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్

'ఫీజు రీయింబర్స్‌మెంట్' పాయే!

- **బకాయిలు వన్‌టైం సెటిల్మెంటే..**
- **తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన**
- **మంత్రి దుద్దిళ్లకు బాధ్యత అప్పగింత**
- **నిరుపేద విద్యార్థులపై పెనుభారం**
- **ఉన్నతవిద్యకు దూరమయ్యే ప్రమాదం**
- **ఫీజుల కోసం విద్యార్థులపై ఇప్పటికే కాలేజీ యాజమాన్యాల ఒత్తిడి**
- **సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులు**

హైదరాబాద్, జూలై13 (నమస్తే తెలంగాణ) : 'ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు పాత బకాయిలు పూర్తిగా చెల్లిస్తం'.. ఇది ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ చేసిన వాగ్దానం. కానీ, ఇప్పుడు ఆర్థిక భారం సాకుతో బకాయిల చెల్లింపునకు ఎగనామం పెట్టాలని నిర్ణయించింది. పూర్తి బకాయిలు ఇవ్వకుండా వన్ టైం సెటిల్‌మెంట్ కింద కాలేజీ యాజమాన్యాలకు ఎంతోకొంత ముట్టజెప్పేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డియే జేఎన్టీయూ వేదికగా శనివారం ప్రకటించారు. వన్‌టైం సెటిల్‌మెంట్ బాధ్యతను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు అప్పగిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ నిర్ణయం యాజమాన్యాల సంగతేమోగాని పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు శాపంగా మారనున్నదనే ఆందోళన వ్యక్తమవుతున్నది. వీరు ఉన్నతవిద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న బీసీ, విద్యార్థి సంఘాలు తాజాగా సీఎం చేసిన ప్రకటనపై మండిపడుతున్నాయి.

దాదాపు 7వేల కోట్ల బకాయిలు

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను మూడు నెలలకోసారి వాయిదాల పద్ధతిలో చెల్లించేలా ప్రభుత్వం గతంలో మార్గదర్శకాలు తీసుకొచ్చింది. దాని ప్రకారం విద్యాసంవత్సరం ప్రారంభంలో 25శాతం, మధ్యలో 50శాతం, చివర్లో మరో25 శాతం చెల్లించాల్సి ఉంటుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధానాన్ని పాటించడం లేదు. బకాయిల చెల్లింపుల కోసం కళాశాలలకు ఏడాది క్రితం నిర్దేశిత మొత్తాలతో ప్రభుత్వం టోకెన్లు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులే దాదాపు రూ.6200కోట్లకు పైగా బకాయి ఉన్నట్టు తెలుస్తున్నది. ఇక ఉపకారవేతనాలు కలుపుకొంటే సుమారు రూ.8వేల కోట్లకు పైనే పేరుకుపోయాయని అధికారవర్గాలు, విద్యార్థిసంఘాలు వెల్లడిస్తున్నాయి.

సెటిల్‌మెంట్‌తో బడుగు విద్యార్థులకే నష్టం

వన్‌టైం సెటిల్‌మెంట్ అంటే కాలేజీలవారీగా బకాయి ఉన్న నిధుల్లో ఎంతోకొంత మాత్రమే ఏకమొత్తంగా చెల్లించే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. ఇది బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకే గుదిబండగా మారే ప్రమాదముంది. ఫీజులు వదులుకునేందుకు ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించవు. ప్రభుత్వం నయానో భయానో ఒప్పించినా పేద విద్యార్థుల ముక్కుపిండి వసూలు చేస్తాయనేది బహిరంగ రహస్యం. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా దాదాపు రాష్ట్రవ్యాప్తంగా ఏటా 10లక్షల మందికిపైగా విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. రీయింబర్స్‌మెంట్‌పై నమ్మకంతో ఉన్నత విద్యాభ్యాసానికి ముందుకొచ్చి ప్రైవేట్ కాలేజీల్లో కోర్సులు పూర్తిచేస్తున్నారు. ఇప్పటికే రీయింబర్స్‌మెంట్ నిధులు రాక కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఫీజులు చెల్లించనిదే పరీక్షలు రాయనివ్వని దుస్థితి నెలకొన్నది. కొందరు అప్పుచేసి, కొందరు సొంతంగా ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. ఇక ఎలాంటి అవకాశం లేని నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యకు మధ్యలోనే స్వస్తిపలుకుతున్నారని విద్యార్థిసంఘాలు వివరిస్తున్నాయి. కొందరు పూర్తిచేసినా యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉద్యోగావకాశాలు పొందలేకపోతున్నారని వాపోతున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో భవిష్యత్‌లో పేద విద్యార్థులెవరూ ఉన్నత విద్యాకోర్సుల్లో చేరేందుకు ముందుకు రారని, కాలేజీలు కూడా అడ్మిషన్స్ ఇవ్వవని విద్యార్థి సంఘాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు వాదిస్తున్నారు. వన్‌టైం సెటిల్‌మెంట్ కింద కాకుండా, బకాయిలను పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

222 రోజులు 32 వేల కోట్లు

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్ర ఖజానాకు చేరనున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనాపగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు రూ.30 వేల కోట్ల అప్పు చేసింది. మంగళవారం నాడు వచ్చే అప్పుతో అది రూ.32 వేల కోట్లకు చేరనున్నది. 20 రోజుల క్రితమే బ్యాంకుల నుంచి రూ.2000 కోట్ల రుణం తీసుకున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన 222 రోజుల్లో రోజుకు రూ.144 కోట్ల చొప్పున రుణాలు సేకరించింది. ఇన్ని అప్పులు చేసినా సరే.. ఆస్తుల కల్పన ఏమైనా జరిగిందా? అంటే అదీ లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందని తీవ్రంగా విమర్శించిన కాంగ్రెస్.. ఇప్పుడు తాను చేస్తున్నదేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఆస్తులను సృష్టించడంపై రేవంత్‌రెడ్డి సర్కారు శ్రద్ధ పెట్టడం లేదని ఆర్థికరంగ నిపుణులు, రాజకీయవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అప్పులతో ఒక భారీ ప్రాజెక్టు కానీ, ప్రజల జీవితాలను మార్చే ఒక భారీ పథకంగానీ చేపట్టిన దాఖలాలు లేవని పెదవి విరిస్తున్నారు.



రుణమాఫీ కోసం అప్పులు

అలవికాని హామీలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటి అమలుకు ఆపసోపాలు పడుతున్నది. తెలంగాణ ప్రజలపై మరింత రుణభారాన్ని మోపుతున్నది. రుణమాఫీ, రైతు భరోసా, రైతుబీమా పథకాల అమలుకు భారీగా రుణాలను సమీకరిస్తున్నది. ఆగస్టు 15లోగా రూ.2 లక్షలలోపు పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్ సర్కారు.. ఇందుకోసం సుమారు రూ.31 వేల కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేసింది. వానకాలం పంటల సాగు సీజన్ ప్రారంభమై నెల గడిచింది. సెప్టెంబర్ వరకు ముగిసే ఈ సీజన్‌లో రైతు భరోసా (గతంలో రైతుబంధు) పథకం కింద ఎకరానికి రూ.7,500 చొప్పున రైతుల బ్యాంకు అకౌంట్లలో జమ చేయాల్సి ఉన్నది. ఈ పథకానికి కనీసం రూ.5 వేల కోట్లయినా తక్షణం అవసరమని అంచనా. 18 నుంచి 59 ఏండ్లలోపు రైతులకు జీవిత బీమా పథకం కిందరూ.1500 కోట్ల ప్రీమియాన్ని ఎల్ఐసీ సంస్థకు పంద్రాగస్టులోగా సర్కారు చెల్లించాల్సి ఉన్నది.

బాండ్ల ద్వారా రూ.15 వేల కోట్లకుపైగా

ప్రతి నెలా రూ.5 వేల కోట్ల నుంచి 6 వేల కోట్ల విలువైన బాండ్లను విక్రయించడం ద్వారా రాష్ట ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నుంచి అప్పులు తీసుకుంటున్నది. జూలై, ఆగస్టు నెలల్లో బాండ్ల విక్రయం ద్వారా రూ.15 వేల కోట్ల నుంచి రూ.18 వేల కోట్ల వరకు తీసుకునేందుకు అవకాశాలు ఉన్నట్టు మీడియాలో వార్తలు వస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ భూములతోపాటు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఐఐసీ) ద్వారా బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లకుపైగా రుణాలను సేకరించేందుకు ఉన్న అవకాశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు తెలిసింది. బాండ్ల విక్రయం, భూముల తనఖా, రైతు సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా కూడా రుణాలు తీసుకోవడంపై ఆలోచిస్తున్నట్టు సమాచారం. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేషన్లు ఏర్పాటుచేసి రుణాలు సేకరిస్తున్నదంటూ ప్రతిపక్షంలో ఉండగా గగ్గోలు పెట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు అందినకాడల్లా తీసుకొస్తున్న రుణాలను మౌలిక వసతుల కల్పనకు, ఆస్తుల సృష్టికి వినియోగిస్తారా? లేదా ఇతర పథకాలకు మళ్లిస్తారా? అని రాజకీయవేత్తలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

రేవంత్ సర్కారు చీకటి ఒప్పందాలు

టెండర్లు రద్దు చేయకుంటే ఉద్యమం

- **పాలనలో లోపించిన పారదర్శకత**
- **40 శాతం ఎక్కువతో మేఘాకు రూ.4 వేల కోట్ల ప్రాజెక్టు పనులు**
- **బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి**

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చీకటి ఒప్పందాలు చేసుకుంటూ అవినీతిమయంగా మారిందని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. జవాబుదారీతనం, పారదర్శకత లోపించిందని, ప్రజాపాలన పేరుతో రాక్షస పాలన సాగిస్తున్నదని ధ్వజమెత్తారు. 40 శాతం ఎక్కువతో మేఘా కృష్ణారెడ్డికి రూ.4 వేల కోట్ల విలువైన పనులను అప్పగించారని, వీటిని రద్దు చేసి గ్లోబల్ టెండర్లు పిలిస్తే 30 శాతం తక్కువకే పనులు చేపట్టేందుకు అనేక కంపెనీలు ముందుకొస్తాయని, తద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.1,200 కోట్లు మిగులుతాయని చెప్పారు. వారం రోజుల్లో పాత టెండర్లను రద్దుచేసి గ్లోబల్ టెండర్లు పిలవాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో మేఘా కృష్ణారెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేసి ఆయనను జైలు పంపిస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి తిరిగి ఆయనకే 40 శాతం ఎక్కువతో టెండర్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కేంద్ర అమృత్ పథకం నిధులకు సంబంధించిన పనులను గ్లోబల్ టెండర్లు లేకుండా ఇచ్చారని, ఇందులో రూ.1200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కార్ అవినీతిని బయటపెట్టి ప్రజాక్షేత్రంలో నిలబెడతామని హెచ్చరించారు. ఈ అవినీతి టెండర్లు రద్దు చేసి గ్లోబల్ టెండర్లు పిలవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఖజానాను దోస్తున్న వారు సీఎం దోస్తులా? రాష్ట్ర ప్రభుత్వ ఆస్థాన గుత్తేదారులా? అని నిలదీశారు. సమాధానం చెప్పకుంటే వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వారం రోజుల్లో టెండర్లు క్యాన్సిల్ చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం కాంట్రాక్టుకు కూడా గ్లోబల్ టెండర్ వేయాల్సిందేనని స్పష్టంచేశారు. దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్టు ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు.

ఆగస్టు 3న అమెరికాకు ముఖ్యమంత్రి

- **వారం రోజులపాటు పర్యటన**

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టులో అమెరికాలో పర్యటించనున్నారు. ఆగస్టు 3 నుంచి 10 వరకు వారంపాటు ఆయన పర్యటన కొనసాగనున్నది. ఇందుకోసం ఆయన శుక్రవారం తన పాస్‌పోర్ట్‌ను రెన్యువల్ చేయించుకున్నారు. అయితే అధికారిక పర్యటనా? వ్యక్తిగత పర్యటనా? అనే అంశంపై ఇంకా ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉన్నది. పర్యటనలో భాగంగా ఎన్నారై పారిశ్రామికవేత్తలతో సమావేశాలు నిర్వహిస్తారని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానిస్తారని సమాచారం. దీంతోపాటు కాంగ్రెస్ అనుబంధ ఎన్నారైలతోనూ సమావేశం అవుతారని తెలిసింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

'ఔట్‌సోర్సింగ్'కు ఉద్యోగ భద్రత కల్పించాలి

- **ప్రభుత్వోద్యోగులతో సమానంగా గుర్తించాలి**
- **ఎంపీలు ఈటల, ఆర్ కృష్ణయ్య**

ఖైరతాబాద్, జూలై 13: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వోద్యోగులతో సమానంగా గుర్తించాలని ఎంపీలు ఈటల రాజేందర్, ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. అడ్డా మీద కూలీలకు రూ.600 నుంచి రూ.800 వస్తుంటే, చదువుకున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.400 మాత్రమే వస్తున్నాయని ఈటల రాజేందర్ తెలిపారు. ప్రభుత్వ సీనియర్ ఉద్యోగులకు లక్షకు పైగా వేతనాలు ఉంటే, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో పీహెచ్‌డీ చేసిన వారున్నా రూ.12 వేల జీతం తీసుకొని పనిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని పీఆర్సీ పద్ధతిలోనే వేతనాల పెం పు వంటి చర్యలు చేపట్టాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. ప్రైవేట్ ఏజెన్సీల చేతుల్లో శ్రమదోపిడీకి గురవుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవేనని కృష్ణయ్య తెలిపారు. సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉన్నదని గుర్తు చేశారు. ఖాళీల ఆధారంగా అర్హులైన వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. పులి లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ ఏజెంట్ అరెస్టు

- **యువతను కంబోడియాకు పంపుతున్న బీహారీ**
- **సైబర్ సెక్యూరిటీ అదుపులో మహ్మద్ షాదాబ్ అలం**

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ఉద్యోగాల పేరుతో తెలంగాణ నుంచి యువతను కంబోడియాకు పంపి, సైబర్ నేరస్థులకు అప్పగిస్తున్న మహ్మద్ షాదాబ్ ఆలం అనే పాస్‌పోర్టు ఏజెంట్‌ను రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. బీహార్‌కు చెందిన అతను దుబాయ్ నుంచి వస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందడంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో వలపన్ని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్ వెల్లడించారు. తన కుమారుడిని అక్రమంగా కంబోడియాకు పంపినట్టు మే 16న సిరిసిల్లకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో షాదాబ్ ఆలంను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ వ్యవహారంలో జగిత్యాలకు చెందిన కే సాయిప్రసాద్, పుణెకు చెందిన మహ్మద్ అబీద్ హుస్సేన్ అన్సారీ పాత్ర కూడా ఉన్నట్టు గుర్తించామని, వీరిద్దరూ గతంలో కూడా ఇలాంటి కేసులో అరెస్టయ్యారని వివరించారు. ఉపాధి నిమిత్తం ఎవరైనా విదేశాలకు వెళ్లాలనుకుంటే తప్పనిసరిగా సైబర్ సెక్యూరిటీ బ్యూరోను సంప్రదించాలని శిఖాగోయెల్ సూచించారు.

తన నివాసంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

- **కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి**
- **ముఖ్యమంత్రిని కలిసిన పటాన్‌చెరు ఎమ్మెల్యే**
- **'గూడెం' చేరికపైనా జోరుగా ఊహాగానాలు**

హైదరాబాద్, జూలై 13(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం మధ్యాహ్నం సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పటివరకు బీఆర్ఎస్ నుంచి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరగా, అరెకపూడి గాంధీ చేరికతో ఆ సంఖ్య తొమ్మిదికి చేరింది. ఇక రాత్రి 8.30 ప్రాంతంలో ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సీఎం నివాసానికి వెళ్లడం రాజకీయవర్గాల్లో కలకలం సృష్టించింది. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వెళ్లిపోయినా..ఆయన చేరికకూ ముహూర్తం కుదిరినట్టు జోరుగా ఊహాగానాలు వస్తున్నాయి.

పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్

- **దేశంలో టాప్ ట్రెండింగ్ మోసం ఇదే**
- **ఇంటి నుంచే ఉద్యోగమంటూ ఎర**
- **అప్రమత్తంగా ఉండాలన్న ఏడీజీ శిఖాగోయెల్**

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. 'ఇంట్లోనే ఉండి జాబ్ చేసుకోవచ్చని, కేవలం యూట్యూబ్ వీడియోలకు లైకులు కొడితే చాలని అమాయకులను ముగ్గులోకి దించుతున్నారు. అనంతరం కొన్ని లింకులను పంపి, లైకులు కొట్టిస్తున్నారు. ఆపై వారి ఖాతాల్లో కొంత నగదు జమ చేసి, అధిక లాభాల పేరుతో ఎర వేస్తున్నారు. టెలిగ్రామ్ గ్రూపులు ఏర్పాటు చేసి, వాటి ద్వారా టాస్క్‌లు ఇస్తున్నారు. అనంతరం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించి నిలువు దోపిడీ చేస్తున్నారు. దేశంలో జరుగుతున్న టాప్ ట్రెండింగ్ మోసాల్లో పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్ అగ్రస్థానంలో ఉన్నట్టు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయెల్ వెల్లడించారు. ఇలాంటి మోసాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను చూసి మోసపోవద్దని తెలంగాణ యువతకు సూచిస్తూ 'ఎక్స్' వేదికగా ఆమె ఓ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు.

మోసం ఎలా జరుగుతుందంటే..

పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చూపిస్తామంటూ కేటుగాళ్లు తొలుత సోషల్ మీడియాలో పోస్టు పెడతారు. ఆ లింకును ఎవరైనా క్లిక్ చేసినా, రిప్లై చేసినా వెంటనే వాట్సాప్, టెలిగ్రామ్ చాట్‌లు ఓపెన్ అవుతాయి. తర్వాత రిజిస్ట్రేషన్ కోసం కొన్ని లింకులు పంపి, వాటిలోనే ఆన్‌లైన్ అకౌంట్ క్రియేట్ చేస్తారు. వెంటనే ఆయా కంపెనీల ప్రతినిధులమంటూ కొందరు చాట్‌లోకి వస్తారు. మొదట వారే ఆ అకౌంట్లో కొంత డబ్బులు వేసి నమ్మిస్తారు. ఆ తర్వాత రూ.100 నుంచి రూ.500 వరకు పెట్టుబడి పెట్టించి, ఆ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు కొత్త టాస్క్ ఇస్తారు. ఆ టాస్క్ పూర్తిచేస్తే వారి ఆన్‌లైన్ అకౌంట్‌లో ఆ డబ్బులకు సంబంధించిన కమీషన్ యాడ్ అవుతుంది. ఆ సొమ్మును విత్‌డ్రా చేసుకోవాలంటే మరో కొత్త టాస్క్ పూర్తి చేయాల్సిందే. ఇలా రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టిస్తారు. కానీ, ఆ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు వీలు కల్పించకుండా మొత్తం దోచేస్తారు.

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు

డ్రగ్స్ కట్టడికి ప్రభుత్వం సరికొత్త వ్యూహం

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): విద్యాలయాల్లో డ్రగ్స్ కట్టడికి తెలంగాణ సర్కారు సరికొత్త వ్యూహంతో ముందుకెళుతుంది. పాఠశాలల్లో డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం శనివారం జీవో –20ని జారీచేశారు. తల్లిదండ్రులు, పోలీసులు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు గల విద్యార్థులతో కలిసి ఈ క్లబ్‌ను ఏర్పాటు చేస్తారు. హెచ్‌ఎం, ప్రిన్సిపాల్ క్లబ్‌కు అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. ఉపాధ్యక్షుడిగా సీనియర్ టీచర్ లేదా చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్ ఉంటారు. 6 నుంచి 10వ తరగతి వరకు క్లాసుకు ఇద్దరు చొప్పున విద్యార్థులుంటారు. పేరెంట్ టీచర్ అసోసియేషన్ నుంచి ఒకరు ప్రతినిధిగా, పోలీస్‌స్టేషన్ నుంచి ఒకరు సభ్యుడిగా ఉంటారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో పోలీసుశాఖ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సహకారం తీసుకోవాలని సూచించారు.